క్లుప్తంగా

మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యం



సీసీ రోడ్లు, కాలువ పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, పార్టీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాస నాయుడు అన్నారు. మండలంలోని అలజంగి పంచాయతీ పరిధిలోని ఆర్థివలస గ్రామంలో జెడ్పీటీసీ నిధులు రూ.5 లక్షలు, ఎంపీపీ నిధులు రూ.2 లక్షలు, పంచాయతీ నిధులు రూ.5 లక్షలతో సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణానికి సోమవారం వారు భూమిపూజ చేశారు. సర్పంచ్ రఘుమండ త్రినాథ్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రేవల్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

దంతవైద్య శిబిరం



శిబిరంలో దంత పరీక్షలు చేస్తున్న డెంటిస్టులు

బొండపల్లి: మండలంలోని అంబటివలస గ్రామంలో సర్పంచ్ ఎస్.కనవయ్య, ఎంపీటీసీ తాళ్లపూడి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రౌతు సూరిబాబు ఆధ్వర్యంలో సోమవారం దంతవైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 150 మందికి అనిల్ నీరుకొండ దంత వైద్యశాల డెంటిస్టులు కె.శ్రీనివాసరావు, హదస్సా, సిబ్బంది దంత పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనిల్ నీరుకొండ దంత వైద్యశాల పీఆర్‌ఓ ఎన్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శౌర్యానికి ప్రతీక ఛత్రపతి శివాజీ



శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న యువత

చీపురుపల్లి: శౌర్యానికి ప్రతీకగా ఛత్రపతి శివాజీ చరిత్రలో నిలిచిపోయారని ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. ఛత్రపతి శివాజీ జయంతిని స్థానిక జి.వి.ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆశయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ చిత్రపటానికి యువకులతో కలిసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ కుల, మతాలు తేడా లేకుండా అందరినీ సమానంగా చూసిన గొప్ప మనసున్న రాజు ఛత్రపతి అన్నారు. యువత ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

వేపాడ ఎంపీడీఓగా ఉమ



ఎంపీడీఓ ఉమకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

వేపాడ: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఈఓపీఆర్డీ జి.ఉమ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఎంపీడీఓగా పనిచేసిన బి.ఎస్.ఎన్.కె.పట్నాయక్ అనకాపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో జిల్లా అధికారులు ఈఓపీఆర్డీ ఉమను ఎఫ్ఏసీ ఎంపీడీఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పీఆర్ ఏఈఈ మహమ్మద్ ఆలీ, కార్యాలయ సూపరింటెండెంట్, సిబ్బంది, ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

బొండపల్లి: బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని వైస్ ఎంపీపీ మీసాల సరోజిని, గొట్లాం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ మహంతి రమణ అన్నారు. బాల్యవివాహాలతో కలిగే అనర్థాలు, బాలికల హక్కులు, లింగవివక్ష తదితర అంశాలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గొట్లాం గ్రామంలో సోమవారం కళాజాత ద్వారా అవగాహన కల్పించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు మీసాల తులసీరాం, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

యూనిఫాం దుస్తుల వితరణ

చీపురుపల్లి: స్థానిక వంగపల్లిపేట ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న చర్చి హాస్టల్‌కు చెందిన 11 మంది విద్యార్థులకు వైట్ యూనిఫాం దుస్తులను ఆ పాఠశాల ఉపాధ్యాయుడు ఎన్.బలరాం సొంత నిధులతో సమకూర్చారు. ఆ యూనిఫాం దుస్తులను ఎంఈఓ ఎం.బూసినాయుడు విద్యార్థులకు సోమవారం అందజేశారు.

వలంటీర్లు... సంక్షేమ సారథులు

- 'వలంటీర్లకు వందనం'లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు,ఎమ్మెల్యే కడుబండి



మెరకముడిదాం: వలంటీర్లను సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మెరకముడిదాం: గ్రామ వలంటీర్లు ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ చేరవేర్చుతున్న సంక్షేమ సారథులని జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. సేవారత్న అవార్డులకు ఎంపికైన వలంటీర్లు పతివాడ చిరంజీవి, మీసాల లక్ష్మి, గెద్ద పావని, వై.జ్యోతి, జమ్మాన షణ్ముఖరావును జెడ్పీ చైర్మన్ సన్మానించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి నెలకొల్పిన గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు, పథకాలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతినెలా ఒకటో తేదీన ఉదయాన్నే వలంటీర్లు తలుపుతట్టి పింఛన్ అందిస్తున్నారని, దేశంలో మరే ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి వ్యవస్థ లేదన్నారు. వలంటీర్ వ్యవస్థపై, ప్రభుత్వంపై తెలుగుదేశం పార్టీ నాయకులు నిత్యం బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారన్నారు. టీడీపీ హయాంలో పథకాలు కావాలంటే జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చుకో వాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ప్రభుత్వంపై టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొటడంతో పాటు, పథకాలను ప్రజలకు వివరించాలని వలంటీర్లకు సూచించారు. జిల్లాపరిషత్ సీఈఓ రాజ్‌కుమార్, ఎంపీడీఓ ఎం.పావని, తహసీల్దార్ వై.వి.పద్మావతి, ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి, వైస్ ఎంపీపీలు టి.హరిబాబు, కందుల పార్వతి, డీసీఎం ఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గ పరిశీలకుడు కె.వి. సూర్యనారాయణరాజు, నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, బూర్లె నరేష్‌కుమార్, పప్పల కృష్ణమూర్తి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



శృంగవరపుకోట: పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

శృంగవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నెలకొల్పిన గ్రామ వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం 'వలంటీర్లకు వందనం'కార్యక్రమం నిర్వహించారు. సేవా రత్న అవార్డులకు ఎంపికైన వలంటీర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా వలంటీర్లు సేవలందిస్తున్నారన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన సూర్యోదయం కంటే ముందే వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్ అందిస్తున్న వలంటీర్లు అభినందనీయులన్నారు. ఎంపీడీఓ సాంబశివరావు, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, రాష్ట్ర ఫోక్ అండ్ కల్చరల్ కార్పొరేషన్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మోపాడ కుమార్, మండల జేసీఎస్ ఇన్‌చార్జి వాకాడ సతీష్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు,గృహసారథులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మెరకముడిదాం/ చీపురుపల్లి: చీపురుపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మెరకముడిదాం, చీపురుపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులను భర్తీ చేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చీపురుపల్లి ఐసీడీఎస్ పీఓ కె.వి.ఎన్.ఆర్.రాజేశ్వరి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. భర్తీ చేయనున్న పోస్టులు, రూల్‌ఆఫ్ రిజర్వేషన్ వివరాలు... మెరకముడిదాం మండలంలోని పులిగుమ్మి గ్రామంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త పోస్టును ఎస్సీకి, చినమంత్రిపేట అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ), బోడందొరవలస అంగన్‌వాడీ హెల్పర్ పోస్టును బీసీ- ఏకు, చీపురుపల్లిలోని రిక్షాకాలనీలో హెల్పర్ పోస్టును ఓసీ, మోదుగులపేటలో హెల్పర్ పోస్టును బీసీ-ఏకు కేటాయించారు. అభ్యర్థులు 21 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగి, 10వ తరగతి ఉత్తీర్ణులైన స్థానిక వివాహిత మహిళలు ఈనెల 24వ తేదీలోగా చీపురుపల్లి ఐసీడీఎస్ కార్యాలయానికి నేరుగా కాని, పోస్టు ద్వారా కాని దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

వియ్యంపేట ప్రాజెక్టు పరిధిలో 4 ఖాళీలు

కొత్తవలస: వియ్యంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న ఒక అంగన్‌వాడీ కార్యకర్త, మూడు హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీఓ ఆర్.ఉమాదేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తవలస మండలంలోని చింతలపాలెంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త పోస్టును (ఎస్టీ), కొత్తవలస మండలం అప్పన్నపాలెం హెల్పర్ పోస్టు (బీసీ-బి), వేపాడ మండలం బానాది అంగన్‌వాడీ కేంద్రం-2 హెల్పర్ పోస్టు (ఓసీ), ఏ.ఎస్.పేట హెల్పర్ పోస్టును ఎస్టీకి కేటాయించినట్లు పేర్కొన్నారు. అర్హులు ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటలు లోగా దరఖాస్తులను గిడిజాల రోడ్డు, కుమ్మరిబంజిరి వద్ద ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో అందించాలని సూచించారు.

అలరించిన ఘంటసాల సంగీత విభావరి



ఘంటసాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎస్పీ చక్రపాణి, జెడ్పీటీసీ శ్రీనివాసరావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని సీతారామ కల్యాణ మండపంలో సహాయ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఘంటసాల సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. సినీ సంగీత దర్శకుడు, నేపథ్య గాయకుడు ఘంటశాల వేంకటేశ్వరరావుతో పాటు స్థానికుడు ఎలిశెట్టి రామ్మోహనరావు మాస్టారు వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. చీపురుపల్లి డీఎస్పీ చక్రపాణి, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఎస్ఎంఎస్ ఫేకర్ ఎల్లాయిస్ పరిశ్రమ డైరెక్టర్ వాకాడ గోపి, సర్పంచ్ పి.ప్రమీల జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఘంటశాల, రామ్మోహనరావు మాస్టారు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంగీత స్వరమాధురి బృందం సభ్యులు ఘంటశాల పాటలను పాడారు. ఉపసర్పంచ్ బమ్మిడి కార్తీక్, ఫేకర్ సెక్యూరిటీ ఆఫీసర్ జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'పల్స్‌పోలియో'ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న వైద్యాధికారి సీతల్‌వర్మ

కొత్తవలస: వచ్చే నెల 3న చేపట్టనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు సీతల్‌వర్మ అన్నారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలు, ఆరోగ్యశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పీహెచ్‌సీ పరిధిలో అప్పుడే పుట్టిన శిశువు నుంచి 5 సంవత్సరాల వయస్సు గల 4027 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం 25 బూత్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృప, పీహెచ్‌ఎన్ రమణమ్మ, సూపర్‌వైజర్లు సూరిదేముడు, బేబి, హెల్త్ సహాయకులు ప్రసాద్, శేషుబాబు, కృష్ణంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న గ్రామపెద్దలు, నాయకులు

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి గ్రామంలో గ్రామస్తులు అంతా కలిసి శివాలయం నిర్మాణానికి వేదపండితుల ఆధ్వర్యంలో సోమవారం శంకుస్థాపన చేశారు. అతిథిగా హాజరైన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు బుద్ధరాజు వెంకట ప్రభుజీరాజు మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐకమత్యాన్ని పెంచుతాయన్నారు. గ్రామ సర్పంచ్ బొద్దల కృష్ణవేణి, గ్రామ పెద్దలు బొద్దల చిన్నంనాయుడు, పాలూరి జోగమ్మ, కొండపల్లి సురేష్, శనపతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు తక్షణ పరిష్కారం



మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: ప్రజలు తమ సమస్యలపై 'స్పందన' కార్యక్రమంలో అందజేసే అర్జీలకు తక్షణం పరిష్కారం చూపాల్సిన బాధ్యత సంబంధిత శాఖల అధికారులు తీసుకోవాలని ఎంపీపీ చల్లా చలం నాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాయంలో సోమవారం 'స్పందన' కార్యక్రమం నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులతో పలు అంశాలపై ఎంపీపీ సమీక్షించారు. ఎంపీడీఓ ఎస్.హరిహరరావు తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంఈఓ బాలభాస్కరరావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని నీలకంఠరాజపురం పాఠశాలలో ప్రైమరీ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిలబస్ త్వరగా పూర్తి చేసి, విద్యార్థులతో రివిజన్ చేయించాలని చెప్పారు. విద్యార్థులతో రోజుకో పదం నేర్పించాలని సూచించారు. నీలకంఠరాజపురం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ సీహెచ్.వెంకటరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మి



కార్మికులతో కలిసి నిరసన చేస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

గజపతినగరం: నెల్లిమర్ల మండలం మిమ్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వి. లక్ష్మి డిమాండ్ చేశారు. కార్మికులకు మద్దతుగా సోమవారం స్థానిక జయంతికాలనీలో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కొన్ని రోజులుగా మిమ్స్ మేనేజ్ మెంట్ కార్మికులను అనేక రకాలుగా బెదిరిస్తోందని ఆరోపించారు. కార్మికులకు ప్రజలందరూ అండగా ఉన్నారని, ఇప్పటికైనా మిమ్స్ యాజమాన్యం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు కనక రాజు, గోవింద, ఏసు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ఆరోగ్య హోమం



హోమం నిర్వహిస్తున్న వేదపండితుడు

విజయనగరం టౌన్: నగరంలోని రింగురోడ్డులో గల వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న మహాసామ్రాజ్య పట్టాభిషేకంలో భాగంగా సోమవారం ఆరోగ్యహోమం ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస సేవా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా విజయ్‌కుమార్, చెరుకూరి శ్రీధర్ పర్యవేక్షణలో వందలాది మంది భక్తులు హోమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, సాయంత్రం విశిష్ట పూజాదికాలు చేశారు.

గ్రామస్వరాజ్యం సాకారం



సచివాలయ భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, నాయకులు

లక్కవరపుకోట: గ్రామసచివాలయ వ్యవస్థను నెలకొల్పి మహాత్మ గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాకారం చేశారని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రేగ గ్రామంలో రూ.78 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలనలో సీఎం జగన్ తీసుకువచ్చిన సంస్కరణల ఫలితంగా గ్రామాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల రూపురేఖలు మారాయన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువయ్యాయన్నారు. గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌ల కోసం కోట్ల రూపాయల వెచ్చించి ప్రభుత్వం భవనాలను నిర్మిస్తోందన్నారు. గతంలో ప్రభుత్వసేవల కోసం ప్రజలు మండల, జిల్లా కేంద్రాల్లోని కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, నేడు ఇంటిముంగిటకే సేవలు అందుతున్నాయన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు కూడా గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తోందని చెప్పారు. డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకటచినరామునాయుడు, ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణ, సర్పంచ్ రావాడ నీలకంఠం, ఎంపీటీసీ బొడ్డు గణపతి, వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మడి స్వాతిరత్నం, దుంగ వెంకటరమణ, లెంక దేముళ్లు, పెదిరెడ్ల వరాహవతారం, బంగారు నాగేశ్వరరావు, బోకం అప్పారావు, పలు గ్రామాల సర్పంచ్‌లు,ఎంపీటీసీలు,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు 'వలంటీర్లకు వందనం'

లక్కవరపుకోట: మండలస్థాయి 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.రూపేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సేవావజ్ర, సేవారత్న,సేవామిత్ర అవార్డులకు ఎంపికైన వలంటీర్లను ముఖ్యఅతిథి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై అవగాహన

మెరకముడిదాం: మండలంలోని భైరిపురం, గర్భాం గ్రామాలలో మాఘమాసాన్ని పురస్కరించుకుని త్రైత సిద్ధాంత భగవద్గీతపై సోమవారం అవగాహన కల్పించారు. త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరి స్వామి రచించిన భగవద్గీత విశిష్టతను ముల్లు రామినాయుడు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సారంనాయుడు, సూరపునాయుడు, కృష్ణ, తవుడు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

దత్తిరాజేరు: భూ సంబంధిత సమస్యలను వీఆర్‌ఓలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ సుదర్శనరావు అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల కోడ్ రాకముందే రైతులు వారసత్వ భూ సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలని కోరారు. గ్రామ సచివాలయంలో అందుబాటులో ఉండి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు ఎప్పటికప్పుడు జారీ చేయాలని ఆదేశించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి నాబార్డు చేయూత

- నాబార్డు డీజీఎం పనికర్

నెల్లిమర్ల రూరల్: మహిళల ఆర్థికాభివృద్ధికి నాబార్డు చేయూత అందిస్తోందని నాబార్డు డీజీఎం పనికర్ అన్నారు. మండలంలోని రామతీర్థంలో ఏపీజీవీబీ సౌజన్యంతో నిర్వహిస్తున్న అగరబత్తీల తయారీ కేంద్రాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతేడాది జనవరి నెలలో నాబార్డు సహకారంతో 30 మంది డ్వాక్రా మహిళలకు అగరబత్తీల తయారీపై శిక్షణ అందించామన్నారు. ఏపీజీవీబీ సహకారంతో యూనిట్‌ను ఏర్పాటు చేసి విజయవంతంగా నడిపించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం నాగార్జున, డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి, గరివిడి ఏరియా కోఆర్డినేటర్ బంగారమ్మ, ఏపీఎం సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

గజపతినగరం: డిజిటల్ బోధనపై మండలంలోని ప్రాథమిక , ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు గంగచోళ్ల పెంట హైస్కూల్‌లో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ కృష్ణంనాయుడు ఆధ్వర్యంలో సోమవారం శిక్షణ ఇచ్చారు. ఎంఈఓలు విమలమ్మ, సాయిచక్రధర్ శిక్షణ శిబిరాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యేలా డిజిటల్ టచ్ స్క్రీన్ టీవీల ద్వారా బోధించాలని చెప్పారు. బాలికోన్నత పాఠశాల హెచ్ఎం చిప్పాడ రమేష్ కుమార్, రిసోర్స్‌పర్సన్ లెంక జగదీష్‌కుమార్, సీఆర్పీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ విమలమ్మ

ఇది చేతల ప్రభుత్వం

- 'గ్రామ సందర్శన'లో ఎమ్మెల్యే కడుబండి



రేగ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

లక్కవరపుకోట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత టీడీపీ ప్రభుత్వంలా మాటలు చెప్పేది కాదని...ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసిన చేతల ప్రభుత్వమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. 'గ్రామ సందర్శన' కార్యక్రమంలో భాగంగా మండలంలోని రేగ గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే గ్రామస్తులతో మాట్లాడి పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.అనంతరం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో సుమారు రూ.79 లక్షలతో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ భవనాలను నిర్మించామన్నారు.నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక పాఠశాలలో సుమారు రూ.28 లక్షలతో అదనపు భవనాల నిర్మాణంతో పాటు, అభివృద్ధి పనులు చేశామని, అలాగే సుమారు రూ.24 లక్షలతో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించామని వివరించారు. సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్ సమప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. అర్హులందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలన్నింటినీ సీఎం జగన్ అమలు చేశారని, నవరత్నాల పథకాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. 2014లో చంద్రబాబునాయుడు 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో మళ్లీ టీడీపీ నాయకులు గ్రామాల్లోకి వచ్చి మాయమాటలు చెబుతారని, వారిని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకటచినరామునాయుడు మాట్లాడుతూ పైసా అవినీతి లేకుండా ప్రజలకు పథకాలు, ప్రభుత్వ సేవలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, మండల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు తూర్పాటి అప్పలరాజు, నాయకులు గుమ్మడి స్వాతిరత్నం తదితరులు పాల్గొన్నారు.